# వీడిన మబ్బులు

విశాలి



వీధిలోకి బండి ఆగినవెంటనే అక్కడే తచ్చాడుతున్న గోపి పరిగెత్తుకుని వెళ్ళి ఒక్క గెంతువేసి బండెక్కాడు. బండి తోలే రత్తిగాడి చేతుల్లోంచి తాళ్ళు లాక్కున్నాడు. రెండు మైసూరెడ్లూ హుందాగ తలలెత్తి ఇటు అటూ తిప్పాయి. మెళ్ళోని మువ్వలు గాలి తాకిడి సంగీతంలాగా చప్పుళ్ళు చేసాయి. తెల్లవారుఝామున ప్రయాణంవల్ల వీధుల్లో ఇంకా ముగ్గులు వేస్తున్నారు మిగతా యిళ్ళలో. శేషాద్రిగారింట మాత్రం పెద్దముగ్గు వేసేసారు. వీధిలోని పందిట్లో రాటలకి కట్టిన కొబ్బరి ఆకులింకా పచ్చగానే ఉన్నాయి. అవీ గుమ్మాలకి వేసిన రంగులూ, తోరణాలూ అన్నీ ఆ యింట్లో అప్పుడే ఎవరికో వివాహం జరిగిందని స్పష్టంగా చెప్తున్నాయి.

బండి మువ్వల చప్పుడు విని శేషాద్రిగారు హడావుడిగా బయటకి వచ్చారు. ఊడిపోయిన గోచీని మళ్ళీ సర్దుకుని పంచ సరిగ్గా ఉందా చూసుకుంటూ "రాజ్యం!ఏమే రాజ్యం.బండి వచ్చేసిందే.

అమ్మడుని త్వరగా రమ్మను. మళ్ళీ దుర్మవార్తాలు వచ్చేస్తాయి" అని కేక పెట్టారు.

కూతురికి బొట్టుపెట్టి కొత్తచీర యిచ్చి కట్టుకోమని పంపించిన రాజ్యలక్ష్మమ్మగారు "అమ్మడూ త్వరగా మార్చుకోమ్మా ! మీ నాన్నగారు హడావుడి పడుతున్నారు," అంటూ హెచ్చరించింది. చీరకట్టుకుని వచ్చి తల్లి కాళ్లకి నమస్కరించింది మాలతి. ఆశీర్వదించాక లేచిన మాలతి కళ్ళు రెండూ నీళ్ళతో చెరువుల్లాగా ఉన్నాయి. అమ్మడూ! ఏడవకమ్మా. ఇది తప్పదు పోయిగా మీ ఆయనతో వచ్చే ఏడాది వద్దువుగాని. మీ అత్తగారేం పరాయిది గాదు. మా పుట్టింటిలో నా చిన్నప్పటి నేస్తం. నేనూ అదీ కల్సి అచ్చనగాయలు ఒప్పులకుప్పలు ఆడుకున్నవారమేను. దాని మనస్సు మంచిదమ్మా. బెంగపెట్టుకోకు. నాన్నగార్కి నమస్కరించి బయల్దేరు. వాళ్ళంతా నేరుగా రాజమండ్రికే వస్తామన్నారు కదా ! నాన్నగారు రాజమండ్రిలో వాళ్ళకి నిన్ను అప్పగించి వస్తారులే. పెద్దవారిని ఎదిరించకు. సీతాలు చెప్పినవన్నీ విను. పనులన్నింటిలో సాయంచెయ్యి. ఎప్పుడూ శుభ్రంగా ఉండు. ఇక్కడలాగే పెందరాళే లే పట్నంగదా అని ప్రొద్దుపోయి లేవక" అంటూ అప్పగింతలు పెడుతూ కళ్ళు తుడుచుకుందావిడ.

పాతికేళ్ళు పెంచి, నక్షత్రం మంచిది గాదని అన్నందువలన చాలా సంబంధాలు తప్పిపోయినందువలన, చిన్ననాటి స్నేహితురాలు సీతాలు, కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేయాలందంతో, మారు మాట్లాడకుండా కూతుర్ని సీతాలుకి కోడలుగా అప్పగించిందావిడ. పెంచిన ప్రేమా,కన్న కడుపు తీపితో పిల్లను కోనసీమనుంచి దూరంగా ఢిల్లీకి పంపుతున్నామే అన్న బెంగతో ఆవిడకి అన్నంకూడా సయించ లేదు. కానీ ఆడపిల్లని కన్నాక ఎవరికి మాత్రం తప్పుతుంది బాధ.

మాలతి బండెక్కింది. బండి బస్సు స్టాండు దగ్గర ఆగాక తండ్రీ కూతురూ దిగి రాజమండ్రికి వెళ్ళే బస్సు ఎక్కి రాజమండ్రిలో దిగారు. మాలతి అత్తగారు సామాను ఏమీ వద్దనడంతో మాలతి ఒక్క బట్టలపెట్టె మాత్రం తీసుకెళ్తోంది. సీతాలు పెద్దకోడలు ఢిల్లీలో ఇంట్లో అన్ని సామాన్లనీ అమర్చింది. మూడేళ్ళకొడుకుని వదిలి చనిపోవటంతో సీతాలు కొడుకు మూర్తికి మళ్ళీ పెళ్ళి తలపెట్టింది. అందుకే మాలతి వంటసామగ్రి ఏమీ తీసుకెళ్లటంలేదు.

స్టేషనుకి వచ్చినప్పటినుంచీ మాలతి కళ్ళు మూర్తికోసం వెతికాయి. పెళ్ళయి వారం అయిందన్నమాటేగానీ మూర్తిని మాలతి ఒంటరిగా చూడలేదు. నాగవల్లి నాటి సాయంత్రం "ఆ ముచ్చట"కూడా

ముగించుదామని శేషాద్రిగారంటే మూర్తి ససేమిరా ఒప్పుకోలేదు అడపెళ్ళివారు రెండో పెళ్ళి కనుక మూర్తి సిగ్గుపడు తున్నా దనుకున్నారు. మూడు నిద్రల కని వెళ్ళిన మాలతి మూర్తివైపు చుట్టాలు అనుకున్నవి విని నిర్ఘాంతపోయింది. వాళ్ళెవరో మాలతికి తెలీదు. సీతాలుకి ఒక్కడే కొడుకవటంతో మాలతికి వాళ్ల వైపు వారిని తెల్సుకోవటానికి అవకాశమే దొరకలేదు.

అలసటగా స్టోరుగదిలో పడుకుంది మాలతి. తలుపు సరిగ్గా వేసిలేదేమో బయటవారి మాటలు లోపలికి విన్పడు తున్నాయి.

"మూర్తి కార్యం వద్దన్నాడుటగా" అందో గొంతుక.

"అవునుట. అయినా సీతాలు పిచ్చి గానీ ఆ కర్కోటకుడు మారుతాడా? మన రాధమ్మ ఎంత చదువుకుంది? ఎంత అణకువ? ఎంత ఓర్పు? దాన్ని నానా యాతనలు పెట్టాడుగా. అమెరికాలో ఎవర్నో మరిగి ఉంటాడు.అలాంటి వాళ్ళకు పెళ్ళెందుకు? పెళ్ళామెందుకు చెప్పు."

"మెల్లగా అను. ఎవరైనా రాగలరు. అమెరికానించి సెలవుపెట్టి వచ్చిన వాడికి మెడలువంచి పెళ్ళిచేసింది. అంతటితో ఆగిందా? రాధని పంపిందా అక్కడ ఏంజరిగిందో ఏమో? రాధ పూర్తిగా మారిపోయింది. అంత చదువుల సరస్వతి వీణనే ముట్టుకోవడం మానేసింది. మాటాడితే ఒట్టు. తనేమిటో, తన పనేమిటో, తన కొడుకు ఆలనా పాలనా ఏమిటో తప్ప ఒక్క సినిమా ఒక్క డ్రామా దేనికి వెళ్ళి ఎరుగదు. చిక్కి శల్యమయి కళ్ళల్లో ప్రాణాలు వచ్చి తీసుకు తీసుకు చచ్చిపోయిందా పిల్ల"

మాలతి కిది వినేసరికి గుండె గుభేలు మంది. మూర్తి కన్నెత్తి మాలతికేసి అసలు చూళ్ళేదు. పెళ్ళిలోగానీ పెళ్ళయ్యాకగాని మాలతికేసి అసలు దొంగ తనంగా కూడా చూళ్ళేదు. అయితే మూర్తిలో ఏదో రహస్యం ఉందన్న మాట ఈ పెళ్ళి ఇష్టంలేదన్నమాట అని తనలో తను అనుకుంది.

ఆవన్నీ రాజమండ్రి స్టేషనులో మూర్తిని చూడగానే జ్ఞాపకంవచ్చాయి. మూర్తి దృష్టి ఒక్కక్షణం మాత్రం మాలతిపై నిల్చింది. వెంటనే తిప్పేసుకుని శాస్త్రిగారితో కబుర్లలో పడ్డాడు. మాలతి మనస్సు చివుక్కుమంది. సీతాలు మాత్రం కోడల్ని చూసి "మా కంటె మీరే ముందర వచ్చారే, అమ్మ కులాసాగా ఉందా? బెంగ పెట్టుకోకుండా పంపిందా. దానికి మాత్రం ఎవరున్నారు కనుక. గోపి ఒక్కడేకదా, ఇల్లంతా బోసిపోయి వుంటుంది," అంటూ పలకరించింది. రాజమండ్రినుంచి బెజవాడకెళ్లి బెజవాడనుంచి ఢిల్లీకెళ్ళే రైల్లో ఢిల్లీ



చేరుకున్నారు ముగ్గురునూ రైల్లోకూడా మాటాడలేదు మూర్తి. ఇదంతా చూస్తున్నకొద్దీ మాలతికి దిగులెక్కువయింది.

ఢిల్లీలో కరోల్‌బాగ్‌లో వాళ్ల ఫ్లాటుకి వెళ్ళారు పక్క ఫ్లాటునుంచి తెలుగావిడ వచ్చి హారతి యిచ్చి మాలతిని లోపలికి తీసుకెళ్ళింది. మాలతి అన్నీ ఆశ్చర్యంగా చూస్తూ కూర్చుంది. కోనసీమలో అచ్చ. పల్లెటూరులో పెరిగిన మాలతికి ఢిల్లీ మహాపట్నాన్ని చూస్తే ఆశ్చర్యం కాక మరేవిటి? విశాలమైన వీధి పెరడు ఉన్న ఇంటినుంచి అగ్గిపెట్టె లాంటి ఫ్లాటుకి వస్తే సంభ్రమం కాక మరేవిటి? అతి మెల్లగా లోపలకి వెళ్ళి నిల్చున్న మాలతిని సీతాలే తీసుకెళ్ళి

గది చూపించింది. అదొకచిన్న గది. ఆ గదిలో ఒక గాడ్రేజీ బీరువా ఒక చిన్న మంచం, ఒక పెద్ద మంచం ఉన్నాయి. బట్టలస్టాండు ఉంది. ఒకటి రెండు పెయింటింగ్సున్నాయి. ఒక్క ఫోటో కూడా లేదు ఇదే చచ్చిపోయిన తన సవితి గది అయిఉంటుంది అనుకుంది మాలతి. సవితి ఫోటో ఉంటుం దేమో నని వెతికింది. ఎక్కడా కనపడ లేదు. మాలతీ వాళ్ళ యింట్లో మండువా హాలులో గోడకి ఒకవందా యాభై ఫోటోలు వ్రేలాడుతాయి ఇక్కడ ఒక్కటికూడా లేకపోయేసరికి అతి ఆశ్చర్యంతో చూసింది. బహుశా ఫోటో వుంటే ప్రతినిముషం జ్ఞాపకానికి వచ్చి కొడుకు బాధపడతాడేమోనని తన అత్త గారే తీసేసారేమోనని అనుకుంది. స్నానం చేసి బట్టలు మార్చుకుని అత్త గారికి సాయం చెయ్యడానికని వెళ్ళింది.

సాయంత్రం చీకటిపడుతుండగా ఆటోరిక్షాలో ఒక లావుపాటి ఆవిడ వచ్చింది కూడా ఒక అబ్బాయి బొద్దుగా ముద్దుగా వున్నాడు. వాడు లోపలకి రాగానే మూర్తి గబగబా లేచి తన గది లోకి వెళ్ళిపోయాడు. ఆ వచ్చినావిడ "సీతాలూ చూసావే! అది చచ్చిపోయినా నీ కొడుకు మారలేదు. రాధమ్మ కొడు కుని నే తేగానే వెళ్ళిపోయాడు." అంటూ రాగాలు మొదలెట్టింది.

"ఊరుకోవే సూరీడూ! అసలే కోడలు పిల్లకి కొత్తకదా! దాన్ని వేరే పాడుచేసిన వాళ్ళం అవుతాం. దారా నాయనా! నా బంగారు కదూ! బాబాల కొండ!దామ్మా నిన్ను వదిలివెళ్ళను రా! రా బుజ్జీ దా" అంటూ మనవణ్ని తీసు కుంది సీతాలు

"సూరీడూ! నిన్ను తిప్పించాలు పెట్ట కుండా అన్నం అదీ తిన్నాడే బాబు." అంటూన్న సీతాలుని మధ్యలోనే ఆపి "ఆ తిన్నాడులే, తినకేం ఖర్మ. తల్లిలేని వాడు. దరిద్రుడికి ఆకలెక్కువని దుర దృష్ట జాతకుడు. ఇంకా సవితితల్లి చేతిలో ఏం పాట్లు పడుతాడో. అయినా గానీ నీ కోడలుని చూపవేమిటి! కొత్త కోడలుని దాచుకున్నావా?" అని ప్రశ్నించింది

మాలతి ఇంక ఊరుకోనేరకపోయింది. దుఃఖం గొంతుక నొక్కేసింది. మెల్లగా హాలులోకి వచ్చి కొత్తావిడకి పెళ్ళి మినప సున్ని అటుకులూ ఇచ్చింది. మాలతిని ఎగాదిగా చూసి "బొత్తిగా పల్లెటూరిది. ఆ బిగుతుగా జడా అదీ ఏమిటే. ఎంతో చదివి, చక్కగా వీణ వాయించి అందంగా నాజూకుగా ఉన్న రాధమ్మే మీ వాడికి నచ్చలేదు కదా! ఈ పిల్లతో కాపరం చేస్తాడంటావా?" అంటున్నావిడ వాక్ప్రవాహానికి వంతెనలా మూర్తి బయ టకి వచ్చాడు. దాంతో ఆవిడ మాటలు ఆపేసింది. మూర్తిని చూసి బాబు నానమ్మ వెనకాల దాక్కున్నాడు.

మాలతి అత్తగారు మెల్లగా ఆ వచ్చి నావిడని సాగనంపింది.

బాగా చీకటిపడటంతో దీపాలువేసి భోజనాలకని కంచాలు సర్దుతుండగా టెలిఫోను మ్రోగింది. అది తీసి మాట్లాడిన మూర్తి హడావుడిగా వచ్చి "అమ్మా నేను అర్జంటుగా బొంబాయి వెళ్ళాలి. మా కంపెనీ డైరక్టరు ఫోను చేసారు. త్వరగా అన్నం పెట్టెయ్," అంటూ హడావుడి హడావుడిగా భోంచేసి చిన్న సూటుకేసులో బట్టలు సర్దుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళేముందరేనా తనతో ఒక్క మాటకూడా మాట్లాడలేదని గుర్తించిన మాలతి గబగబా గదిలోకి వెళ్ళిపోయింది. మంచంమీద పడుకుని తన బాధంతా బయటకి వచ్చేలాగా ఏడ్చింది. లేచి ముఖం కడుక్కుని ఆ గదినంతా పరీక్షచేసింది ఎక్కడా రాధ తాలుకు ఉత్తరాలుగానీ చీరలుగానీ చిహ్నమన్నది కన్పడలేదు. అత్తగారి గదిలోకి వెళ్ళింది. అత్తగారూ బాబు కల్సి పడుకున్నారు. భర్త నిరాదరణ గుర్తుకొచ్చి బాబుని దగ్గరికి తీసుకోవాలని నిర్ణయించుకుని గదిలోకి వెళ్ళి పడుకుంది. మూర్తికీ, రాధకీ వేర్వేరు గదులుండటమే తను విన్నవాటికి నిదర్శనమని గుర్తించింది మాలతి

మర్నాటినుంచీ ఆ యింటి వాతావరణానికి అలవాటుపడసాగింది. ఒక పంజాబీ ఆడదివచ్చి అంట్లుతోముతుంది. కానీ బట్టలుతకదు. వేన్నీళ్ళలో సర్ఫు పొడి వేసి బట్టలు నానబెట్టి మాలతే ఉతుక్కుంది. జమేదారిణీ వచ్చి బాతురూములవీ కడిగి వెళ్తుంది. కూరలవాడు ఇంటిదగ్గరికే వచ్చాడు. వాడిదగ్గర అత్తగారే కూరలు బేరంచేసి కొంది. బాబుని మెల్లగా మచ్చిక చేసుకుంది మాలతి. "అమ్మా!... అని పిలవటం నేర్చుకున్నాడు బాబు దగ్గరలోనున్న కిండరుగార్టన్ స్కూలుకో చేర్పించినందువలన ఒంటిపూట స్కూలుకి వెళ్తాడు.

ఊరుకి వెళ్ళిన మూర్తి ఒక వారం రోజులయ్యాక గానీ రాలేదు. ఈ వారమూ ఒక్క ఉత్తరంగానీ కబురుగానీ లేదు మాలతికి తన జీవితం వృధా అయిపోతుందా అన్న బెంగ పట్టుకుంది. కానీ బయటపడలేదు.

జడని వదులుగా వేసుకోవటం జడలో ఒకప్రక్కకి మాత్రం రోజాని పెట్టుకోవడం నేర్చిందీ వారంలోను. బిగుతుగా జడ వేసుకోవటం రెండు మూరల చామంతి పెట్టుకోవటం మానేసింది. ప్రైవేటుగా మెట్రికు చదివినది కనుక మెల్లగా పత్రిక, ప్రభ, యువ పుస్తకాలన్నీ కరోల్‌బాగ్ అత్తగారితో వెళ్ళి తెచ్చుకుని బాబు స్కూలుకెళ్ళినప్పుడు తీరిక సమయంలో చదువుకుంది.

వెళ్ళిన వారానికి వచ్చాడు మూర్తి.


అలసివున్న మూర్తిని చూసిన మాలతి బాత్‌రూములోకి వెళ్ళి వేన్నీళ్ళు తొరిపి వుంచింది. చాకింటి తువ్వాలుని బాత్ రూములో పెట్టింది మూర్తితో అసలు మాట్లాడనంమనలిన బెరుకుగా వుండి బాబుతో "నాన్నగార్ని స్నానం చెయ్య మని చెప్పమ్మా!" అంది. బాబు భయ పడ్తూనే మూర్తి దగ్గరగా వెళ్ళాడు.

"నాన్నారండీ..." అంటూ ముట్టు కున్న బాబుని చూడగానే ముఖం ఆ ప్రక్కకి తిప్పేసుకుని "వీడినెందుకు నా దగ్గరకి పంపారు, తీసుకుపోండి." అంటూ గట్టిగా అర్చాడు మూర్తి. మాలతి హడలిపోయింది. గబగబా వెళ్ళి బాబుని ఎత్తుకుంది ఇంతట్లోగా సీతాలు వంటిట్లోంచి వచ్చి "ఏరా ఆది పోయినా కూడా దానిమీద కోపం తగ్గలేదట్రా." అంటూ బాబును మాలతి చేతుల్లోంచి తీసు కుని వెళ్ళిపోయింది. మాలతికేసి చూడ నైనా చూడకుండా బాత్రూములోకి వెళ్ళి పోయాడు మూర్తి. గ్రుడ్లనీళ్ళు గ్రుక్కు కుని మాలతి అత్తగారిదగ్గరకి వెళ్ళి పోయింది.

భోజనాల దగ్గర కూడా మూర్తి ముభా వంగానే ఉన్నాడు. మాలతి వద్దనకి వెళ్ళలేదు. భయం భయంగా బాబుతో పాటు వంటింట్లోనే కూర్చుంది. అత్తగారే వద్దన చూసుకుంటుంటే బాబుకి వంటింట్లో గోరుముద్దల తిన్పించింది. బాబు నిద్ర పోయాక వంటింటి పనంతా అయ్యాక సీతాలు మాలతిని పిల్చింది. "అమ్మడూ! వెళ్ళి తెల్లచీర మార్చుకోమ్మా. ఇదుగో వేణీ సాయంత్రం కొన్నది ఇది పెట్టుకో. మూర్తి గదిలోకి పాలు మంచినీళ్ళు తీసు కెళ్ళు"

మాలతికి ముచ్చెమటలూ పోసాయి. విన్న రెండు మాటలూ మూర్తిని కర్కోట కుడిగానే చిత్రించాయి తనతో మాటేనే మాట్లాడలేదు. బాబుని అదిలించిన మూర్తి గదికి ఏ ధైర్యంతో వెళ్లగలదు!

సందేహిస్తున్న మాలతిని చూసి సీతాలు "వాడు కోపగించుకున్నాడని భయపడకమ్మా! వాడిని నువ్వే దారి లోకి తీసుకురావాలి, వెళ్ళు." అంటూ పంపిందావిడ. మాలతి తన గదికెళ్ళి స్నానంచేసి అత్తగారిచ్చిన తెల్లచీర కట్టుకుని వేణీని జడలో తురుముకుని పాలగ్లాసు మంచినీళ్ళు తీసుకుని మూర్తి గది కర్టెనుని తీసుకుని వెళ్ళి నిల్చుంది. గదంతా నీటుగా ఉంది మంచంమీద తెల్లటి దుప్పటీ రెండు ఫోము తలగ డాలూ వున్నాయి .మూర్తి ముఖంమీద చెయ్యి పెట్టుకుని కప్పుకేసి చూస్తూ పడుకున్నాడు. ఆ సమయంలో మూర్తిని చూస్తే మాలతికి కర్కోటకుడి లాగా అన్పించలేదు. మెల్లగా వెళ్ళి మంచం దగ్గరగా వెళ్ళి "పాలు" అంది. కళ్ళమీదనుంచి చెయ్యి తీసేసిన మూర్తి మాలతిని తదేకంగా చూసాడు. లేచి కూర్చుని "మాలతీ నే ఒక్కటి అడుగు



తాను ఏమీ అనుకోవుకదా!'' అన్నాడు. ఆశ్చర్యంగా చూసింది మాలతి.

"నువ్వెప్పుడైనా కో ఎడ్యుకేషను స్కూల్లో చదివావా?" అన్నాడు. లేదని తల అడ్డంగా ఊపింది మాలతి. "నీకెవరైనా పెళ్ళిడు బావలున్నారా?" అన్నాడు. "లేరు," అని మళ్ళీ తలాడించింది. "నువ్వెవరినేనా పెళ్లిచేసుకుందామనుకున్నావా?" అన్న ప్రశ్నకి నిర్ఘాంతపోయింది మాలతి. కానీ మెల్లగా "లేదు" అంది

"అమ్మయ్య!" అని నిట్టూర్చాడు మూర్తి. ''మాలతీ ఇలా వచ్చికూర్చో," అంటూ సౌమ్యంగా అంటున్న మూర్తిని మరింత ఆశ్చర్యంగా చూసింది. మూర్తి లేచి వెళ్ళి గది తలుపులు మూసేసాడు. గడియపెట్టి వచ్చాడు. "మాలతీ ఆ బాబుని మాత్రం ముట్టుకోకు నేను నీతో సరిగ్గా ఉంటాను" అన్నాడు.

మరీ ఆశ్చర్యపోతూ మాలతి "అదేవిటండీ ఎవరేనా సవితి తల్లి వస్తే కొడుకుని సరిగ్గా చూడదేమోనని బెంగపెట్టుకుంటారు. మీరేమో మీ కొడుకుతో మాట్లాడవద్దంటారేమిటి?" అంది

"ఆపు మాలతీ ఆపు వాడు నా కొడుకు కాదు! మా అక్క నే సెంవు పెట్టి రాగానే రాధని చూపి పెళ్ళాడమంది. చదువుకున్న పిల్ల తెల్సినవాళ్ళ

పిల్ల అందంగా ఉంది కదా అని సరే నన్నాను. కానీ రాధకిది బలవంతపు పెళ్ళి అని తెలీదు. మొదటి రోజే నాతో చెప్పి ఏడ్చింది తను తన బావని ప్రేమించానని ఇద్దరూ రహస్యంగా గుళ్లో పెళ్ళిచేసుకున్నారనీ కానీ తన తల్లితండ్రులు భయపెట్టి ఈ పెళ్ళికి ఒప్పించారట. నెల తప్పినందువలన హడావుడిగా పెళ్ళి చేసారుట. ఎంత మోసం అని పళ్ళు కొరుక్కున్నా అబ లగా బేలగా చూస్తున్న రాధని వది లెయ్యాలనిపించలేదు. కానీ భార్యగా స్వీకరించవద్దని రాధే అడిగింది. తను మనసా వాచా తన బావనే పెళ్ళాడింది. తన శరీరాన్ని ఇంకొకరు ముట్టుకోకూడ దంది. అన్నిటికీ ఒప్పుకుని రాధని అమెరికాకి తీసుకెళ్ళిపోయినా నెలలు గడుస్తున్నకొద్దీ రాధంటే ఒక విధ మైన అసహ్యం వేసింది. అందుకే పురి టికి పంపలేదు. శాశ్వతంగా ఆ ఊరు వదిలి ఈ పూడు రాధతో మూన్నెళ్ళ బాబుతో వచ్చాను. కానీ ఆ బాబుని చూసినప్పుడల్లా వాడు నా రక్తమాంసాలు పంచుకోలేదు వాడు పాపఫలం అని గుర్తుకొచ్చేది మాలతీ నే దేముణ్నిగాను మామూలు మనిషిని. రాధని వదిలెయ్యాక పోయినా రాధనీ, బాబునీ తీసుకుని లాలించేంత దైవత్వం నాకు లేదు- సాటి మనిషిగా చూడ్డంకూడా బాధగావుండేది అందుకే మాట్లాడ్డం మానేసాను. నే చేసింది తప్పా! నే కర్కోటకుడినేనా చెప్పు." అంటూ మాలతి భుజాల్ని పట్టుకుని కుదిపేసాడు మూర్తి, ఇన్నే ళ్ళుగా దాచుకున్న రహస్యాన్ని బయ టకి చెప్పటంతో మూర్తి గుండె తేలి కయింది.

మాలతికన్నీ అర్థమయ్యాయి ఆడది తప్పు చేస్తే క్షమించే గుణం మగవారిలో వుండదు మూర్తి పూర్తిగా క్షమించక పోయినా, రాధని విడిచిపెట్టకుండా సంఘం రాధని వేలెత్తి చూపకుండా, నిజాన్ని దాచిపెట్టి స్వంత తల్లితో కూడా బాబు తన కొడుకనే చెప్పి, తను మనిషేనని నిరూపించుకున్నాడు. అలాంటి మూర్తి కర్కోటకుడెలా అవు తాడు. అదే చెప్పింది మూర్తితో.

"కానీ ఇందులో బాబు తప్పే ముందండీ. ఇప్పుడు రాధకూడా లేదు కనుక మరింక వాణ్ని నిర్లక్ష్యం చెయ్య కండి. అనాధ పిల్లల్నెంతమందిని చూళ్ళేదు. అలాగే బాబుని వదిలెయ్యడం న్యాయంకాదనిపిస్తోంది." అని మెల్లిగా తన అభిప్రాయం వెళ్ళడించింది.

ఆశ్చర్యంగా చూసాడు మూర్తి. "పెద్ద చదువులు చదవకపోయినా నీలో ఉన్న సంస్కారం నాలో లేక పోయింది మాలూ. ఇంక నీ మాటే ఈ యింట్లో అందరం వింటాం" అంటూ మాలతిని ప్రేమతో ఆరాధనతో దగ్గ రగా తీసుకున్నాడు. పెళ్ళినాటినుంచీ వున్న సందేహాలన్నీ పటాపంచలవ డంతో మాలతి తేలికైన హృదయంతో మూర్తి చేతుల్లో ఇమిడిపోయింది.